

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలోని సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటినుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ 08572232745, వాట్సాప్–9849907885 నెంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన ఉంటుందన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన ఉంటుందని ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు.

నేడు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

గుడిపాల: మండలంలోని చింతగుంటూరు, శ్రీరంగంపల్లె గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ రషిృత తెలిపారు. ఉదయం 10 గంటలకు చింతగుంటూరు, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరంగంపల్లె గ్రామాల్లో వైద్యసేవలు అందజేయనున్నట్లు చెప్పారు. నడవలేని వారికి ఇంటివద్దనే వెళ్లి వైద్యం అందిస్తామని వివరించారు.

గుడిపాల: తిరునాళ్లలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తవణంపల్లె: మునీశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న అశేష భక్త జనం



వైభవంగా పొన్నియమ్మ తిరునాళ్లు

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లె గ్రామంలో పొన్నియ్య తిరునాళ్ల వైభవంలో నిర్వహించారు. గ్రామదేవత పొన్నియమ్మను ఆదివారం రాత్రి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆడినెల సందర్భంగా ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయనతోపాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు రజినీకాంత్, సాయి, శిలంబరసన్, భాస్కర్, పయణి పాల్గొన్నారు.

మునీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

తవణంపల్లె: మండల కేంద్రంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో మునీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మునీశ్వర స్వామికి భక్తులు పొంగలి పెట్టి, పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేయించారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో మునీశ్వరస్వామి

రైతులకు అందుబాటులో యూరియా

గుడిపాల: రైతులకు యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పేయనపల్లె, పాపసముద్రం, బొమ్మసముద్రం, పానాటూరు, నారగల్లు రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఒక బస్తా ధర రూ.267కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పంటకు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో తీసుకోవచ్చని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని రాములుగుడివీధిలో ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ ఆస్పత్రి సహకారంతో వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 177మంది హాజరు కాగా 103 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి అన్ని వసతులు కల్పించడంతోపాటు ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుభాష్‌జైన్, ప్రేమ్ చంద్, విశాల్‌జైన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి రూ.60 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి మండలంలో రూ.60 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలాల్లో రోడ్డు, డ్రైనేజీ పనులను వీటి ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంయుక్తంగా నివేదికను పంపాలని ఆదేశించారు.

ఐక్యతతోనే బీసీల రాజ్యాధికారం



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఆర్.రాజన్ తదితరులు

చిత్తూరు రూరల్: ఐక్యతతోనే బీసీల రాజ్యాధికారం సాధ్యమవుతుందని వన్నెకుల క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకులు సి.ఆర్.రాజన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వెన్నకుల క్షత్రియ చైతన్య సదస్సులో భాగంగా నగరంలోని జ్యోతీరావు, జాతిపిత విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలమనేరులో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి వస్తున్న తనకు అడుగడుగునా బీసీలు బ్రహ్మరథం పట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో ఐక్యతను చాటాలని కోరారు. రాజ్యాధికారం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు త్రిమూర్తి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.